కమ్మరి.. ఆదరణ కరువే మరి!

- ఇనుప పనిముట్లకు తగ్గిన డిమాండ్
- రెడీమేడ్, అధునాతన యంత్రాలతో బ్రేక్
- సబ్సిడీ రుణాలు, పింఛన్ మంజూరుకు వేడుకోలు



కొలిమి పని చేస్తున్న కమ్మరులు

తలుపుల : వంశపారంపర్యంగా వస్తున్న కులవృత్తులలో కమ్మరి ఒకటి. ఇనుమును కరిగించి వివిధ రకాల ఆకృతిలో వస్తువులను తయారు చేసే లోహ శిల్పి కమ్మరి. భగభగమండే కొలిమి ముందు కూర్చుని వేడిని లెక్క చేయక రైతుకు అవసరమైన పనిముట్లు చేస్తాడు. కమ్మరి కొలిమి రాజేసి ఇనప ముక్కలతో కొడవళ్లు, గునపాలు, నాగళ్లు చేస్తాడు. రెడీమెడ్ పనిముట్లు, ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో కమ్మరికి ఉపాధి తగ్గిపోయింది.

- కదిరి నియోజకవర్గంలోని కదిరి, ఎన్పీకుంట, గాండ్లపెంట, తలుపుల, తనకల్లు, నల్లచెరువు మండలాల్లో 450కి పైబడిన కుటుంబాలు కమ్మరి వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. సాధారణంగా ఖరీఫ్ వ్యవసాయ సీజన్ (జూన్, జూలై, ఆగస్టు మాసాలు) ప్రారంభంలోనే కొలిమి పనులు జోరుగా ఉండేవి. పొలం పనులకు ఉపయోగించే ఇనుప పరికరాలు తయారు చేయించుకునే వారు. వర్షాకాలంలో రైతులు పనిముట్ల తయారీ కోసం కొలిమి వద్దకు వచ్చేవారు. ఉపాధి కూలీలు సైతం తమ పనిముట్లు పదును చేయించుకునేవారు. మరికొంత మంది ట్రాక్టర్ పనిముట్ల మరమ్మతుల కోసం వచ్చేవారు. వ్యవసాయ సీజన్ కాకుండా మిగతా రోజుల్లో అడపా దడపా ఉపాధి ఉంటుంది. తీవ్ర వర్షాబావ పరిస్థితులేర్పడి ఈ మధ్యకాలంలో అధునాతన పరికరాలు వాడటంతో కొలిమి పనులకు ఆదరణ కరువైంది. తమ వృత్తికి ఆదరణ తగ్గి పోవడంతో తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని కమ్మరులు వాపోతున్నారు. నిప్పుల సెగకు శరీరం ఉడిగిపోవడంతో ఎక్కువ కాలం పని చేయలేని పరిస్థితికి చేరుకుంటున్నామని, తమ ఇబ్బందులను గమనించి 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసి ఆసరా కల్పించాలని కోరుతున్నారు.

నిస్సహాయ స్థితిలో ఉన్నాం



తాతల కాలం నాటి నుంచి కమ్మరి వృత్తినే నమ్ముకున్నాం. మాకు ఏ ఇతర పనీ చేయడం రాదు. రోజంతా కష్టపడినా సగటు రూ.250 నుంచి రూ.300 కంటే ఎక్కువ సంపాదించలేకపోతున్నాం. కుటుంబ పోషణ భారమైంది. రానురాను కమ్మరి వృత్తికి ఆదరణ తగ్గడం వలన నిస్సహాయ స్థితిలో బతుకుతున్నాం.

– మల్లయ్య ఆచారి, గాలివాండ్లపల్లి, తలుపుల మండలం

సబ్సిడీ రుణాలు అందించాలి



కులవృత్తి, చేతివృత్తి చేసుకునే వారిలో అర్హులను గుర్తించి విరివిగా సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి. రుణసాయం చేస్తే శారీరక శ్రమ కాస్త తగ్గించడానికి ఆధునిక పనిముట్ల తయారీ, యంత్రాల కొనుగోలు చేయడానికి ఉపయోగపడుతుంది. ఆ దిశగా ప్రభుత్వం బ్యాంకులకు ఆదేశాలు జారీ చేయాలి.

– ఎస్.ఫక్రుద్దీన్, సంగం బజార్, తలుపుల

ప్రభుత్వాలు ఆదుకోవాలి.



కమ్మరులు నిప్పు సెగల్లో కొలిమి పెట్టి 20, 30 సంవత్సరాలకే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ వేడితో శరీరంలోని సత్తువను కోల్పోతున్నాం. ప్రభుత్వం మాలాంటి వారిని గుర్తించి 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేయాలి. ఇలా చేస్తే మా కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది.

– దుబ్బాచారి, తలుపుల, తలుపుల మండలం

క్లుప్తంగా

పంచాయతీ పాలనపై శిక్షణ



సూచనలిస్తున్న ఈఓపీఆర్డీ మాధవరెడ్డి

ఎన్పీకుంట: పాలనపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈఓపీఆర్డీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. పంచాయతీరాజ్ చట్టాలపై, పంచాయతీ పాలనపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కనీస పరిపాలనలో కీలక పాత్ర పోషించాలన్నారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటివాటిపై దృష్టిపెట్టాలని సూచించారు.

నల్లచెరువు: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతి చెందిన గోవిందురెడ్డి

నల్లచెరువు: దేవరింటిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దేవరింటి గోవిందురెడ్డి (77) బుధవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, నాయకులు ఉత్తన్న, బాబూరెడ్డి తదితరులతో కలిసి గ్రామానికి వెళ్లి గోవిందురెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

తలుపుల : ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కె.రామానాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదివరకు ఇక్కడే ఏఓగా విధులు నిర్వహించిన విషయం విదితమే. ఈ సందర్భంగా రామానాయక్ మాట్లాడుతూ అందుబాటులో ఉంటూ సిబ్బంది సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

నల్లమాడ: గ్రామపంచాయతీ కేంద్రాల్లోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవడానికి వార్డు సభ్యులు కృషి చేయాలని అధికారులు సూచించారు. వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమం బుధవారం నల్లమాడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ప్రారంభించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అమర్‌నాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి త్రివేణి సభ్యులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న 'పల్లె పండుగ' కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పీఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి

బత్తలపల్లి: ట్రాఫిక్ నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చని బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు అన్నారు. అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై తంబాపురం క్రాస్ వద్ద బుధవారం వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపైన అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానాలు విధించారు. అనంతరం వాహనదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పెద్దారెడ్డి, ఓబిలేసు, సుదర్శన్‌నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



ఇంట్లో కొలువైన బొమ్మలు

ధర్మవరం అర్బన్: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ లలిత నాట్య కళానికేతన్ నిర్వాహకుడు, నృత్యకళాకారుడు బాబుబాలాజీ ఇంట్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా దసరా నవరాత్రుల సందర్భంగా 9 రోజులపాటు బొమ్మల కొలువు ఏర్పాటు చేసి చుట్టుపక్కల ప్రజలను పిలిచి వారికి తాంబులాలు అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా 9 రోజుల పాటు నృత్యకళాకారుడు బాబుబాలాజీ, కూతురు, నృత్యకళాకారిణి రామలాలిత్య వివిధ రకాల బొమ్మలతో ఇంటిని అలంకరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకరప్ప

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి కట్టుగా కృషి చేయాలని జెడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభ్యులకు వివరించారు. వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ.. జూన్, జూలై నెలల్లో వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు వేరుశనగ సాగు చేయలేకపోయారని తెలిపారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల సాగు చేసుకునేందుకు ప్రభుత్వం విత్తనాలను సబ్సిడీ ధరపై అందజేసిందన్నారు. ఇందుకు జెడ్పీటీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. చాలా మంది రైతులకు ఈ విత్తనాలు అందలేదన్నారు. అర్హులైన రైతులందరికీ ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందేలా చూడాలని ఏఓకు సూచించారు. రైతులు సాగు చేసిన పంటలకు ఈ–క్రాపింగ్ చేస్తున్నామన్నారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించడం లేదు.. దీనిపై పర్యవేక్షణ చేసి సమస్యను పరిష్కరించాలని ఎంఈఓకు సూచించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

తనకల్లు: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని కదిరి ఏడీఏ సత్యనారాయణ అన్నారు. గైవ్లపల్లిలో జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రైతు క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి రైతూ పురుగుమందు లేని వ్యవసాయం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. జనజాగృతి సంస్థ సహకారంతో పండించిన కొర్రలు, సామలు, నవ ధాన్యాలు, కిచెన్ గార్డెన్‌ల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ శాస్త్రవేత్త నరసింహులు, ఏఓ శ్రీహరినాయక్, వాసన్ ప్రతినిధి ఉత్తప్ప, కీటక పరిశోధకులు రమేష్‌నాయక్, ఆత్మా ప్రతినిధి మౌనిక, ఏపీ మాస్ వాసుదేవారెడ్డి, ఎన్ఆర్‌జీఎస్ రషీద్, జనజాగృతి సీఈఓ బలరాం, పీడీ రాంప్రసాద్‌రెడ్డి, ఐలీ శ్రీనివాసులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మద్యం దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు



మాట్లాడుతున్న సీఐ వీరారెడ్డి

కదిరి: మద్యం దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పొడిగించినట్లు కదిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఉప్పలపాటి వీరారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 12 దుకాణాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 77 దరఖాస్తులు అందాయని తెలిపారు. అర్జీదారుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నెల 11వ తేదీ సాయంత్రం వరకూ గడువు పొడిగించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 11వ తేదీకి బదులుగా 14న లాటరీ తీసి లైసెన్సులు ఖరారు చేస్తారన్నారు. 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపును ఆశావహులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు.

సీసీ కుటుంబానికి రూ.6.31 లక్షల సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీసీ ఆనంద్ కుటుంబ సభ్యులకు ఉమ్మడి అనంతపురం జిల్లా డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది రూ.6.31 లక్షల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన వెలుగు సీసీ ఆనంద్ చెన్నేకొత్తపల్లి మండలంలో విధుల నిర్వహిస్తూ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతడి కుటుంబానికి అండగా నిలువాలన్న ఉద్దేశంతో జిల్లా డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది తమ ఒక రోజు వేతనాన్ని పోగుచేసి సహాయం చేశారు. ఈ మొత్తాన్ని బుధవారం మామిళ్లపల్లి గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎం రామ్మోహన్ చేతుల మీదుగా మృతుని భార్య లక్ష్మీదేవికి అందజేశారు.

సంక్షిప్త సమాచారం

జాగ్రత్తలతో సురక్షిత ప్రసవం

ఓడీచెరువు : ఆహార నియమాలు, ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే సురక్షిత ప్రసవం సాధ్యమవుతుందని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. ఓడీచెరువు పీహెచ్‌సీ ప్రాంగణంలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ నిర్వహించారు. 51 మంది గర్భిణులు పరీక్షించగా.. వారిలో 11 మందిని హైరిస్క్‌గా గుర్తించి అత్యవసర చికిత్స కోసం సిఫార్సు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు, వారి సహాయకులకు కదిరి రోటరీ క్లబ్ సభ్యులు నాగేళ్ల రంజిత్, సేగు సాగర్ పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో నాగవేణి, మనోహర్, దిల్షాద్, విజయకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ముదిగుబ్బ: పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ భాస్కర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి గాను అభివృద్ధి ప్రణాళికల తయారు కోసం సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు.

మద్యం దుకాణాలకు 13 దరఖాస్తులు

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లోని ఐదు మద్యం దుకాణాలకు ఇప్పటి వరకూ 13 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ఫరూక్ ఆజామ్, ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

సర్వేయర్‌కు మెమో

కదిరి అర్బన్: కాళసముద్రం సచివాలయ సర్వేయర్ రవినాయక్‌కు ఎంపీడీఓ పోలప్ప మెమో జారీ చేశారు. బుధవారం సచివాలయాన్ని తనిఖీ చేసిన సమయంలో సర్వేయర్ మూమెంట్ రిజిష్టర్‌లో సంతకం చేయకుండా.. విధులకు డుమ్మా కొట్టారు. దీంతో ఎంపీడీఓ మెమో జారీ చేశారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రెడ్డెప్ప

తనకల్లు: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రెడ్డెప్ప బుధవారం తన బాధ్యతలు చేపట్టారు. ఈయన ఓడీ చెరువు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తున్న వెంకటరమణ ఓడీ చెరువుకు బదిలీ అయ్యారు.

మొక్కలు నాటండి.. ఆదాయం పొందండి

తలుపుల : ప్రతి రైతూ ఎకరం విస్తీర్ణంలో ఐదు రకాల పండ్ల మొక్కలు నాటితే ఆరు నెలల నుంచి ఆదాయం పొందడంతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని సీఎస్ఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆదినారాయణ సూచించారు. బుధవారం బి.కొత్తపల్లిలో సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో 15 మంది రైతులకు సేక్రీస్ వారి సహకారంతో ఏడు రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, కదిరి ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు నరసింహులు, కృష్ణానాయక్, సేక్రీస్ ప్రతినిధి అరుణ్, ఏఓ షాదాబ్, శ్యామల, గంగులప్ప పాల్గొన్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు అర్హులైన వారు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారులు మున్వర్‌బాషా, ప్రసూన్‌కుమార్ నాయుడు బుధవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు చెన్నేకొత్తపల్లి మండల వాసులై ఉండాలన్నారు.

గాయపడిన ఉపాధి కూలీ

కదిరి అర్బన్: మత్తన్నగారిపల్లిలో నారాయణమ్మ అనే ఉపాధి హామీ కూలీ పని ప్రదేశంలో అదుపుతప్పి కిందపడి గాయపడింది. చికిత్స నిమిత్తం స్థానికులు కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలిని ఎంపీడీఓ పోలప్ప, ఏపీఓ శ్రీధర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తనకల్లు: మారప్పగారిపల్లికి చెందిన చిన్న కుళ్లాయప్ప అనే యువకుడు బుధవారం ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాపీ మేస్త్రీ రవికుమార్ (40) బుధవారం మృతి చెందాడు. ముక్తాపురం గ్రామానికి చెందిన రవికుమార్ నాలుగు రోజుల క్రితం మామిళ్లపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడిని మొదట అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించారు. అయితే అక్కడ కూడా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడక చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సరోజమ్మ, ఒక్క కుమార్తె ఉన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఫెస్టివల్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నల్లమాడ: ఆర్డీటీ ఏరియా కార్యాలయ ఆవరణలో బుధవారం ఏరియాస్థాయి ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించారు. నల్లమాడ, ఓడీ చెరువు మండలాల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రంగోళి, క్లే మోడల్, పిక్చర్ పెయింటింగ్, పేపర్ కటింగ్, న్యాచురల్ కోలాజ్, హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో విద్యార్థులు తయారు చేసిన బొమ్మలు, నమూనాలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ వేమనారాయణ, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, సుగుణమ్మ జడ్జిలుగా హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ వన్నూరుస్వామి, ఆర్డీటీ సిబ్బంది శ్రీనివాసులు, గంగప్ప, నరసింహులు, రాజశేఖర్, కుళ్లాయమ్మ, సంఘం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుట్టపర్తి డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ రత్నకు పూల మొక్కను అందజేస్తున్న డీఎస్పీ విజయకుమార్

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి డీఎస్పీగా విజయకుమార్ బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో డీఎస్పీగా పనిచేసిన వాసుదేవన్‌ను ఎన్నికల అనంతర బదిలీల్లో భాగంగా వీర్‌కు పంపారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ డీఎస్పీగా శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పుట్టపర్తి నూతన డీఎస్పీగా విజయకుమార్‌ను నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎస్పీ రత్నను డీఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు.

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

ఎన్పీకుంట: కేజీబీవీలో ఔట్‌సోర్సింగ్ విధానం కింద బోధనేతర ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వంట సహాయకులు–2, కాపలాదారులు–1, స్వీపర్–1 చొప్పున పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. మండలానికి చెందిన ఆసక్తి గల మహిళలు ఈ నెల 15వ తేదీలోగా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

ధర్మవరం రూరల్: మోటుమర్ల వద్దగల కేజీబీవీలో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను ఒప్పందం ప్రాతిపదికన ఏడాది కాలానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రాజేశ్వరిదేవి ఓ ప్రకటనలో తెలిపారు. డే, నైట్ ఉమెన్ –1, అసిస్టెంట్ కుక్–1 పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఈ నెల 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమడగూరు: గుండువారిపల్లి సమీపంలోని కేజీబీవీలో రెండు బోధనేతర (సహాయ వంట మనిషి) పోస్టులకు మహిళలు ఈ నెల 15వ తేదీలోగా ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ జిలాన్‌బాషా తెలిపారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్లలోపు వయసున్న మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు 47 సంవత్సరాలు, దివ్యాంగ మహిళలకు 52 ఏళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్ కుటుంబాల్లోని మహిళలకు 45 ఏళ్లలోపు వరకు వయసు సడలింపు ఉంటుందన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టాలని ఆర్డీఓ మహేష్ ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ శ్రీనివాసులు, అగ్నిమాపక అధికారి రాజు, ఇరిగేషన్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో ఆర్డీఓ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ నిబంధనల మేరకు ఇసుక రవాణా జరగాలన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రాకర్స్, ఫైర్ వర్క్స్ లైసెన్సులు జారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని, ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన ఏపీఎంగా నారాయణ

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండల నూతన ఏపీఎంగా నారాయణ బుధవారం వెలుగు కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. కొత్తచెరువు ఏపీఎంగా ఉన్న రవీంద్రరెడ్డి బుక్కపట్నానికి బదిలీ కావడంతో గోరంట్ల ఏపీఎంగా పనిచేస్తున్న నారాయణను కొత్తచెరువు ఏపీఎంగా బదిలీ అయ్యారు. బుధవారం బాధ్యతలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

ఆర్‌అండ్‌బీ ఉద్యోగి మృతి

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంక్ వెనుక కాలనీలో నివాసముంటున్న బాబావలి (36) అనే ఆర్‌అండ్‌బీ ఉద్యోగి బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. బాబావలి ఉదయం పాల ప్యాకెట్ కోసం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చాడు. ఆ సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలాడు.



బత్తలపల్లి, ధర్మవరం, తనకల్లు, అమడగూరు, కదిరిలోని వివిధ దేవాలయాల్లో బుధవారం చదువుల తల్లి సరస్వతీమాతగా దర్శనమిచ్చిన అమ్మవార్లు



పుట్టపర్తి, ముదిగుబ్బలో సరస్వతీమాతగా దర్శనం

సరస్వతీ నమోస్తుతే

దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలు పోటెత్తుతున్నాయి. ఏడో రోజు బుధవారం పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారు సరస్వతీ దేవితో పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాల పంపిణీ చేశారు. పలు చోట్ల భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. – సాక్షి బృందం



ధర్మవరం, మామిళ్లపల్లిలో ప్రత్యేక అలంకరణలో..